క్లుప్తంగా

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు



అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

కనగల్: మండల పరిధిలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అర్చకులు పూజలు చేసి అమ్మవారికి హారతి ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పసుపు, కుంకుమలతో అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళా భక్తులు బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



తిప్పర్తి : పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా తిప్పర్తి ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బైరం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌ను పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్, మండల అధ్యక్షుడు నామిరెడ్డి మహేందర్‌రెడ్డి అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం, మండల విద్యాధికారి నర్సింహనాయక్ అభినందించారు.

నేడు డీసీసీ సమావేశం

నల్లగొండ : నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం డీసీసీ సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అబ్జర్వర్లుగా మక్తల్ ఎమ్మెల్యే వాకటి శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నసీర్ అహ్మద్ హాజరవుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలోని వివిధ కాలనీల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లైన్ షిఫ్ట్ కోసం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. గవర్నమెంట్ హాస్పిటల్, సతీష్ నగర్, డాక్టర్స్ కాలనీ, అన్సారీ కాలనీ, బస్టాండ్ ఎదురుగా, దారుషఫా కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కనగల్: మండల పరిధిలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయం ఆవరణలో జగిని టెక్స్‌టైల్స్, దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జగిని వెంకన్న, సీఐ ఆదిరెడ్డి, ఆలయ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఈఓ జయరామయ్య, ఆలయ అర్చకులు శ్రవణ్, ఏఎస్‌ఐ నర్సింహారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, శ్రీకర్, జగాల్‌రెడ్డి, రవి, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

రోడ్డు పనులను అడ్డుకోవద్దు

చండూరు : రోడ్డు పనులను ఎవరూ అడ్డుకోవద్దని, అధికారులు నిబంధనల ప్రకారం పనిచేయాలని డీఎస్పీ శివరాంరెడ్డి సూచించారు. మంగళవారం చండూరు పోలీస్‌స్టేషన్, సీఐ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో రోడ్డు పనులు చేస్తున్నప్పుడు డివైడర్ ఏర్పాటు విషయంలో కొందరు అడ్డుపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ ఎస్టీ కేసుల విచారణ నిమిత్తం వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట చండూరు సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐ నర్సింగ్ వెంకన్నగౌడ్ ఉన్నారు.

టీజేఎస్ ఆవిర్భావ దినోత్సవం

రామగిరి (నల్లగొండ): టీజేఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో టీజేఎస్ జెండాను పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పన్నాల గోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు లాపూర్ క్రాంతికుమార్, డాక్టర్ తోట నరసింహాచారి, కె.కిరణ్‌కుమార్, వంగాల వెంకటరెడ్డి, కట్ల జగన్నాథం, పాల నవీన్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం

మునుగోడు: నియోజకవర్గ కేంద్రమైన మునుగోడులో ప్రభుత్వం నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించనున్నారు. ఐదేళ్ల క్రితం నిర్మించిన క్యాంపు కార్యాలయానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరమ్మతులు చేయించారు. ఆరు నెలలుగా కొనసాగిన పనులు ఇటీవల పూర్తయ్యాయి. ఆ భవనాన్ని ఎమ్మెల్యే దంపతులు ప్రారంభించి ఇక నుంచి అక్కడే ఉండి నియోజకవర్గ ప్రజలకు సేవలు అందించేలా ఏర్పాట్లు చేసుకున్నారు. క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవానికి నియోజకవర్గంలోని ప్రజలందరూ హాజరుకావాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- వేధిస్తున్న లారీల, హమాలీల కొరత
- రోజుల తరబడి కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం రాశులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు



తేరట్‌పల్లి కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం రాశులు

గట్టుప్పల్ : ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని వరి సాగు చేసి.. పంట కోత కోసి.. ధాన్యం కొనుగోలు కేంద్రంలో అమ్ముకునే వరకు రైతులకు తిప్పలు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యాన్ని రోజుల తరబడి కొనుగోలు చేయకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్‌పల్లి గ్రామంలో ఎఫ్ఎస్‌సీఎస్ (రైతు సేవా సహకార సంఘం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన జరుగుతున్నాయి, దీంతో కేంద్రంలో రైతులు రోజులతరబడి నిరీక్షించాల్సి వస్తోంది. గ్రామంలో ఈ నెల 11న అధికారులు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నాలుగైదు రోజుల తర్వాత కేంద్రానికి రైతులు ధాన్యం తీసుకొచ్చారు. ఆనాటి నుంచి నేటి హమాలీల కొరత, లారీల దిగుమతి ఆలస్యం సాకులు చెబుతూ ధాన్యం కాంటా వేయడంలో నిర్వాహకులు ఆలస్యం చేస్తున్నారు. దాదాపు పది పదిహేను రోజులుగా రైతులు ధాన్యం ఆరబెట్టి కుప్పలు చేయడానికి కూలీలకు కూలి డబ్బులు, ధాన్యం ఆరబెట్టేందుకు పట్టాల కిరాయి పెరిగిపోతోంది. కూలీలు రోజూ రూ.500 నుంచి రూ.600 వరకు, పట్టాలకు రూ.30 వరకు అద్దె తీసుకుంటున్నారు. దీంతో రైతులకు ఆర్థిక భారం అవుతోంది. కేంద్రం ప్రారంభం నుంచి సుమారు 15 రోజులుగా 4 లారీల ధాన్యం మాత్రమే నిర్వాహకులు మిల్లుకు పంపించారు. లోడ్ చేసిన లారీ మిల్లుకు పోయి తిరిగి వచ్చేసరికి మూడు రోజులు పడుతుండడం, దీనితోడు హమాలీల కొరత ఉందని నిర్వాహకులు చెబుతున్నారు.

7500 క్వింటాళ్లకుపైగా ధాన్యం..

తేరట్‌పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు భారీగా ధాన్యం తెస్తున్నారు. గతంలో కంటే ఈ దఫా కొనుగోలు కేంద్రానికి ధాన్యం ఎక్కువగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటివరకు 160 మంది రైతులు 7500 క్వింటాళ్ల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చారు. రైతులు ధాన్యం ఆరబోసుకునేందుకు పట్టాలు అందుబాటులో లేక దూర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు. అకాల వర్షాలతో తమ ధాన్యం ఎక్కడ తడుస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిగా ధాన్యం కాంటా వేయించాలని రైతులు కోరుతున్నారు.

ఆలస్యం చేస్తున్నారు



వారం రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చా. కాంటా వేయడానికి ఆలస్యం చేస్తున్నారు. లారీలు, హమాలీల కొరత ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. అకాల వర్షాలు వస్తాయని ఆందోళనగా ఉంది. రాత్రి సమయాల్లో ధాన్యం కాపాడుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాం.

– వడ్డగోని నర్సింహ, రైతు

లారీల కొరత తీర్చాలి



హమాలీల, లారీల కొరత అధికారులు తీర్చాలి. రోజుల తరబడి కొనుగోలు కేంద్రంలో నిరీక్షించడం ఇబ్బందిగా ఉంది. అకాల వర్షం ఎప్పుడు వస్తుందోననే భయం ఉంది. ధాన్యం ఆరబెట్టి, దగ్గరకు చేయడానికి కూలీ డబ్బులు పెరిగిపోతున్నాయి. పట్టాల కొరత తీవ్రంగా ఉంది.

– నల్లవెల్లి మల్లేశం, రైతు

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం



కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అదనంగా రెండు, మూడు లారీలను ఏర్పాటు చేసేందుకు ఆర్‌డీఓ, సివిల్ సప్లయ్ అధికారులతో మాట్లాడాను. హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– రాములు, గట్టుప్పల్ తహసీల్దారు

వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు



సరస్వతీ దేవి పూజలో పాల్గొన్న భక్తులు

నకిరేకల్ : పట్టణంలోని శ్రీ షిర్డిసాయి ఆలయ 18 వార్షికోత్సవం, శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి అమ్మవారి దశమ వార్షిక వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయ పూజారి దుర్గి మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో శ్రీ సరస్వతీ దేవి అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, శ్రీ మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన పూజలు నిర్వహించారు. కామినేనటి దుర్గాప్రసాద్, నాగశిరోమణి, వీఎస్ఆర్ మిల్క్ ప్రొడక్ట్ వారి సహకారంతో అన్నప్రసాద వితరణ చేశారు. వేడుకల్లో ఆలయ చైర్మన్ వనమా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి ఉప్పల వెంకటరమణ, ప్రతినిధులు తోనుపునూరి శ్రీనివాసులు, రాంబాబు. బండారు వేణుగోపాల్, వలిశెట్టి స్వప్న, కందగట్ల మమత, పిల్లలమర్రి సునీత, జోర్రిగల శ్రీనివాస్, దాచేపల్లి శ్రీనివాస్, వలిశెట్టి భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



తిప్పర్తి : జంగారెడ్డిగూడెంలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ పరుశురాం

తిప్పర్తి : మండలంలోని జంగారెడ్డిగూడెం, అంతయ్యగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తిప్పర్తి తహసీల్దార్ పరుశురాం మంగళవారం పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కాంటాలు వేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీఎం శ్రీదేవి ఉన్నారు.

బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే చర్యలు

మర్రిగూడ : ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సెంటర్ ఇన్‌చార్జ్‌లు ఉండడం లేదని, ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారని అన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలని వినతి

చిట్యాల: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య ఆధ్వర్యంలో మంగళవారం సీపీఎం, రైతు సంఘాల నాయకులు తహసీల్దార్ కృష్ణనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు అర్రూరి శ్రీను, మండల అధ్యక్షుడు బొబ్బల సుధాకర్‌రెడ్డి, శీలా రాజయ్య, ఇద్దయ్య, బాబురావు, మహేష్, యాదయ్య, పెంటయ్య పాల్గొన్నారు.

ఇళ్ల సర్వే రెండు రోజుల్లో పూర్తి చేయండి



రికార్డులు పరిశీలిస్తున్న సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

వేములపల్లి : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను రెండు రోజుల్లో పూర్తిచేయాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఏ ఒక్క గ్రామంలో కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ రికార్డుల నిర్వహణను సమర్థంతంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శారదాదేవి, సూపరింటెండెంట్ సత్యప్రభ ఉన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

తిప్పర్తి: జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి మంగళవారం తిప్పర్తి మండల పరిషత్ కార్యాలయం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పెట్రోల్ డబ్బాలతో రైతుల ఆందోళన

- భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్



పెట్రోల్ డబ్బాలతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

నార్కట్‌పల్లి : మండలంలోని గోపాలయపల్లికి చెందిన పలువురు రైతులు పెట్రోల్ డబ్బాలతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గోపాలయపల్లి శివారు సర్వే నంబర్ 550లో రామిడి గోపాల్ (30 గుంటలు), కట్ట లక్ష్మి (20 గుంటలు), కోమురెల్లి వనజాత (20 గుంటలు), కల్లేపల్లి వెంకటయ్య (20 గుంటలు), కల్లేపల్లి గోపాల్ (20 గుంటలు), కోమరెల్లి జనార్దన్‌రెడ్డికి (20 గుంటలు) లావణి పట్టా భూమి ఉన్నది. చిట్యాల మండలం వట్టిమర్తి నుంచి నార్కట్‌పల్లికి వచ్చే కాల్వ నీటితో గతంలో ఈ భూములు సాగు చేసుకునేవారు. ప్రస్తుతం కాల్వ రాకపోవడంతో భూమి పడావుగా ఉంది. ఈ భూముల పక్కన ఉన్న షీనా బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, ఎంపిల్ కంపెనీ ఆ భూములను రైతులు సాగు చేసుకోకుండా అడ్డుకుంటున్నాయి. దీనిపై రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించారు. అయినా అధికారులు పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేశారు. భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని 2017 నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. భూమి సాగు చేసేందుకు వెళ్తే కంపెనీ నిర్వాహకులు అడ్డుకుంటున్నారని.. వారినుంచి ప్రాణహాని ఉందని అధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో ఆత్మహత్యే శరణమంటూ పెట్రోల్ బాటిళ్లతో ఆందోళన చేసున్నామని పేర్కొన్నారు.

రెండెకరాలు స్వాధీనం చేసుకున్నాం: తహసీల్దార్

రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్‌ఐ క్రాంతికుమార్ అక్కడికి చేరుకుని తహసీల్దార్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రైతులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే చేయగా.. 550 సర్వే నంబర్‌లో షీనా బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, ఎంపిల్ కంపెనీలు ప్రభుత్వ భూమి రెండు ఎకరాలు అక్రమించినట్లు నిర్ధారణ అయ్యిందని తెలిపారు. ఆ భూమిని ఇటీవలే స్వాధీనం చేసుకుని బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూములు సాగు చేసుకునే రైతులకు తగు న్యాయం చేస్తానని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ టూటౌన్: ఆస్తి పన్ను చెల్లించి ప్రభుత్వం కల్పించిన 5 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ కోరారు. మంగళవారం ఎఫ్‌సీఐ అధికారులు రూ.17 లక్షల ఆస్తి పన్నును రాయితీ కింద చెల్లించారు. వారికి కమిషనర్ రశీదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 శాతం రాయితీకి బుధవారం ఒకరోజు మాత్రమే గడువు ఉందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఓ శివరాంరెడ్డి, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

మే 25లోగా సమ్మతి పత్రాలు ఇవ్వాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు మే 25వ తేదీలోగా బ్యాంకులు సమ్మతి పత్రాలు ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజీవ్ యువ వికాసంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. బ్యాంకర్లు రాజీవ్ యువవికాసం పథకం కింద గుర్తించిన లబ్ధిదారులకు సమ్మతి ఇవ్వడంలో జాప్యం చేయవద్దని ఆదేశించారు. లబ్ధిదారులందరికీ బ్యాంకుల్లో జీరో అకౌంట్ ప్రారంభించాలని తెలిపారు. లబ్ధిదారులకు మంజూరు చేసే సబ్సిడీ మొత్తం ఈ జీరో అకౌంట్లలో జమ అవుతుందన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం శ్రమిక్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తులను ఆశ్రయించొద్దు

తిప్పర్తి : మధ్యవర్తులను ఆశ్ర యించకుండా ఫిర్యాదుదారులు నేరుగా పోలీస్ స్టేషన్‌కు రావాలని ఎస్‌ఐ సాయిప్రశాంత్ అన్నారు. తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదసూరారం గ్రామంలో ప్రజలకు మంగళవారం మిషన్ పరివర్తన్‌లో భాగంగా పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సాయిప్రశాంత్ మాట్లాడుతూ నేరం జరిగినప్పుడు, అనుమానాస్పద పరిస్థితులు ఉంటే మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా పోలీస్ స్టేషన్‌కు రావాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ లింగయ్య, కానిస్టేబుళ్లు ప్రకాశ్, వెంకటేష్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

చిట్యాల: హైదరాబాద్‌లో బీసీ సంఘాల సమావేశానికి వెళ్లకుండా చిట్యాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులను మంగళవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి చిట్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయినవారిలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, రెండు, తొమ్మిదో వార్డుల ఇన్‌చార్జ్‌లు కోనేటి ఎల్లయ్య, ఆగు అశోక్, నాయకులు పోల్లేపల్లి సత్యనారాయణ, ఆవుల అంజి, ఆవుల ఆనంద్, ఎండీ.గౌస్, కన్యాయచారి ఉన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న డీసీఓ పత్యానాయక్

నల్లగొండ టౌన్: కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులు తప్పనిసరిగా ఆర్‌బీఐ నిబంధనలు పాటిస్తూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా సహకార అధికారి ఎం. పత్యానాయక్ సూచించారు. మంగళవారం నల్లగొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంఘమిత్ర కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఆధ్వర్యంలో సహకార అర్బన్ బ్యాంకుల పాలసీ సంస్కరణల అవసరాలపై జరిగిన రాష్ట్రస్థాయి సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సహకార అర్బన్ బ్యాంకుల పాలకవర్గంపై ఉన్న నమ్మకంతోనే ప్రజలు డిపాజిట్లు చేస్తారని అన్నారు. ఐక్యరాజ్య సమితి 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందని, దానిలో భాగంగానే సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర సహకార శాఖ రిటైర్డు అసిస్టెంట్ రిజిస్ట్రార్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ సంగెం రామకృష్ణ ఆధ్వర్యంలో సంఘమిత్ర కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఆర్‌బీఐ నిబంధనలు పాటిస్తూ ఖాతాదారులకు మంచి సేవలు అందిస్తూ లాభాల బాటలో నడుస్తోందన్నారు. అనంతరం సంఘమిత్ర బ్యాంకులో అధిక డిపాజిట్లు చేసిన వెంకట్‌రెడ్డి, కొంగరి జగన్, సింగం దుర్గయ్యలను చైర్మన్ రామకృష్ణ సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు సన్నిదానం చక్రపాణి, మహ్మద్ షరీఫ్, డైరెక్టర్లు పున్న చండికేశ్వర్, కొంగరి భిక్షం, గజ్జెల వెంకటేశ్వర్లు, అంజిరెడ్డి, బండ భిక్షంరెడ్డి, లక్ష్మీనర్సు, పద్మ, జెల్లా శ్రీశైలం, చంద్రశేఖర్, సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఔట్‌డోర్ స్టేడియంలో క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని మేకల అభినవ్ ఔట్‌డోర్ స్టేడియంలో మంగళవారం వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు, యువకులు ఈ శిక్షణను ఉపయోగించుకోవాలన్నారు. కాగా ఈ శిబిరంలో భారత మాజీ క్రికెటర్ అర్షద్ అయూబ్ పాల్గొని ఆటగాళ్లను ఉత్సాహ పరిచారు. అర్షద్ అయూబ్, శంకర్‌నాయక్ కాసేపు క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్ ప్రారంభం



హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

నల్లగొండ : నిర్వహిస్తున్న ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఈఏపీసెట్ ప్రవేశ పరీక్షలు మంగళవారం ప్రారంభయ్యాయి. నల్లగొండ జిల్లాలోని ఎస్పీఆర్ స్కూల్ పరీక్ష కేంద్రానికి 185 మంది విద్యార్థులను కేటాయించగా.. ఉదయం నిర్వహించిన పరీక్షకు 179 మంది హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 177 మంది హాజరు కాగా ఎనిమిది మంది గైర్హాజరైనట్లు పరీక్షల విభాగం చీఫ్ సూపరింటెండెంట్ నీలం రెడ్డి తెలిపారు.

వెలిమినేడులో వాలీబాల్ పోటీలు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మల్లం యాదయ్య స్మారకార్థం నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను మంగళవారం డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, మండల కార్యదర్శి వడ్డగాని మహేష్, దేశబోయిన నర్సింహ, అర్రూరి నర్సింహ, ఆడేపు రమేష్, గోలి సాయికిరణ్, పవన్, మనోజ్, వెంకట్రామయ్య, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ టౌన్ : గోదావరిఖని జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్ఓ) డాక్టర్ ప్రసన్న కుమారిని బెదిరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుధాకర్ లాల్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఆ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్ఓ స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేయగా స్కానింగ్ కేంద్రం నిర్వాహకులు మాజీ కార్పొరేటర్ డీఎంహెచ్ఓను దూషిస్తూ బెదిరింపులకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి

నకిరేకల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న 75 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూరు మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన మహేశ్వరం రాములు(75) ఈ నెల 23వ తేదీన తన సొంత గ్రామం నుంచి నకిరేకల్‌కు పని నిమిత్తం తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో నకిరేకల్ మండలంలోని చందంపల్లి శివారులో జాతీయ రహదారిపై వెనుకు నుంచి వస్తున్న గుర్తు తెలియని కారు రాములు నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాములు డివైడర్‌పై పడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. రాములును హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి కుమారుడు అమరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కృష్ణచారి తెలిపారు.

రెమ్యూనరేషన్ చెల్లించాలని వినతి

నల్లగొండ: గత సంవత్సరం సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎన్యూమరేటర్లకు రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరుతూ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం మంగళవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట సబావత్ వెంకట్‌కుమార్‌నాయక్ ఉన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషిచేయాలి



నకిరేకల్ : ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ అధికారి అంజుమ్

నకిరేకల్ : బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని ఐసీడీఎస్ నకిరేకల్ ప్రాజెక్టు అధికారి అంజుమ్ కోరారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా నకిరేకల్ జెడ్పీ హైస్కూల్లో మత పెద్దలు, పూజారులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్ల లకు 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేయవద్దన్నారు. అనంతరం బాల్య వివాహాలను కట్టడి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని, సునీత, అశ్రీత, కోఆర్డినేటర్ శోభారాణి, ఝాన్సీ, పూజారి జిగురు లక్ష్మీనర్సింహమూర్తి, చర్చి పాస్టర్ వేముల అనోక్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

కట్టంగూర్ : బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బూరుగు శారదారాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాల్య వివాహాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వడ్లకొండ అశోక్, పూజారి యుగేంధర్ శర్మ, కోఆర్డినేటర్ అశ్రిత, శోభారాణి, జాన్సీ, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.